ఆందోళనలో ఆటో వాలాలు..!

- ఉచిత బస్సు పథకంతో..
- వీధిన పడనున్న వందలాది కుటుంబాలు
- నిరసనకు సిద్ధమవుతున్న ఆటో డ్రైవర్లు



మక్కువ ఆటో స్టాండ్‌లో ఉన్న ఆటోలు

మక్కువ:

కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం అమల్లోకి తీసుకొస్తుండగా, ఆటో వాలాలు ఆందోళనలో పడ్డారు. ఎన్నో ఏళ్లుగా ఆటో నమ్ముకొని, కుటుంబాలను నెట్టుకొస్తూ.. పిల్లలను చదివించుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మా కుటుంబాలు రోడ్డున పడనున్నాయని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న స్త్రీశక్తి పథకం వలన ఆటోడ్రైవర్లంతా నష్టపోయే అవకాశముందని, కూటమి ప్రభుత్వం తమకు భద్రత కల్పించాలని కోరుతూ ఆటోడ్రైవర్లంతా ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

● స్త్రీశక్తికి తాము వ్యతిరేకం కాదు...

తాము ప్రభుత్వం అమలు చేయనున్న స్త్రీశక్తి పథకానికి వ్యతిరేకం కాదని... కానీ దీని ప్రభావంతో తమ కుటుంబాలు రోడ్డున పడతాయని ఆటో డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు భరోసా కల్పించి తరువాత ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ప్రభుత్వ నిర్ణయం తమ కడుపు కొట్టినట్టవుతుందని చెబుతున్నారు.

● ఆటోలతోనే జీవనం

మండల కేంద్రం మక్కువ నుంచి బొబ్బిలి, సాలూరు, చినబోగిలి, చెముడు, శంబర, దుగ్గేరు, కోన, గోపాలపురం, తూరుమామిడి తదితర గ్రామాలకు నిత్యం ఆటోలు నడుపుతూ వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. మండలంలోని సుమారు 200 ఆటోలు నడుపుకుంటూ ఆటో డ్రైవర్లు తమ పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సులు నడపనున్నందున, సర్వీసులు అవకాశం తక్కువై, జీవనం కష్టతరంగా మారుతుందని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్ల కుటుంబాలకు భరోసా కల్పించాలని కోరుతున్నారు. మండలంలోని ఆటో డ్రైవర్లంతా గురువారం మండల కేంద్రం మక్కువలో ఆందోళనకు సిద్ధపడుతున్నారు.



మాది మక్కువ మండలంలోని పాయకపాడు గ్రామం. పదిహేనుళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తమ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో సర్వీసులు తగ్గిపోనున్నాయి. ఏ విధంగా కుటుంబాన్ని నెట్టుకు రావాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి మాకు ఆధారం చూపించాలి.

– అంతర్వేది సాయికృష్ణ, ఆటో డ్రైవర్, మక్కువ



మాది మక్కువ గ్రామం. రెండు దశాబ్దాలుగ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ప్రతి రోజూ మక్కువ నుంచి సీతానగరం మండలం చినబోగిలి గ్రామానికి ఆటో నడుపుతుంటాను. రోజుకు రెండు ట్రిప్పులు పడడం కష్టమవుతుంది. ఆయిల్ పోనూ రూ.500 కూడా మిగలడం లేదు. మక్కువ నుంచి పట్టణాలకు, గ్రామాలకు పల్లెవెలుగు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉచిత బస్సు ప్రయాణంతో తమ జీవనం కష్టంగా మారనుంది. ఆ పథకం అమలుకు తాము వ్యతిరేకం కాదు.. కానీ మాకు ఒక భరోసాను ప్రభుత్వం కల్పించాలి.

– మావుడి నరేష్, ఆటో డ్రైవర్, మక్కువ

ఆటో కార్మికుల నిరసన ర్యాలీ



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పేరుతో తమ పొట్టలు కొట్టేలా వ్యవహరించొద్దని బలిజిపేట ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బలిజిపేటలో ఆటో కార్మికులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. ర్యాలీ అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కె.సీతారాం, కార్యదర్శి మోహనరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

– బలిజిపేట

దుకాణాల తనిఖీ



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పార్వతీపురం టౌన్: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఫకీర్ రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 15 దుకాణాలు తనిఖీ చేయగా అందులో నాలుగు దుకాణాల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయాలను గుర్తించినట్లు తెలిపారు. నాలుగు దుకాణాలపై రూ.10,500 అపరాధ రుసుము విధించి 15 కిలోల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ సీజ్ చేసినట్టు తెలిపారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

పార్వతీపురం టౌన్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకులతో కలిసి మరణించిన కుటుంబ సభ్యుల ఫొటోలతో ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ కమిషనర్ రాజుకు యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో ఆప్కాస్ విధానంలో మరణించిన పారిశుధ్య కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. నైట్ డ్యూటీలు చేస్తున్న కార్మికులకు ఏ ఒక్క రక్షణ లేదని, వాహనాల వలన, ఆకతాయిల వలన ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇదే తీరు కొనసాగితే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.శంకరరావు, సిహెచ్.సింహాచలం, సీఐటీయూ నాయకులు బి.సూరిబాబు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.మల్లేష్, పి.గాంధీ, ఆర్.వెంకటరమణ, శీల వినయ్ కుమార్, కె.రాంబాబు, హెచ్.మహేంద్ర, జె.లక్ష్మి, బి.నాగమణి, బి.భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై తస్మాత్..



వెంకంపేటలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి

పార్వతీపురం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రఘుకుమార్ అన్నారు. బందలుప్పి పీహెచ్‌సీ పరిధిలో ఉన్న వెంకంపేట గ్రామ సబ్ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ మేరకు సెంటర్‌లో అన్ని రికార్డులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. అలాగే సబ్ సెంటర్ పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. పీఎంజేఏవై, పీఎంవీవై, ఎన్సీడీసీడీ రక్తహీనత యాక్షన్ కమిటీ, అలాగే సీజనల్ వ్యాధులు, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, పరీక్షలకు సంబంధించిన సూచనలను ఆయన ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి తెలియజేశారు.

విద్యార్థుల ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ

సాలూరు: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ అప్పలనాయుడు అన్నారు. నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో విద్యాలయాల వద్ద సమావేశాలు ర్యాలీలు, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసలు కావడం వలన భవిష్యత్ దెబ్బతింటుందని పేర్కొన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పట్టణంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీ

సాలూరు: పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డ్వామా పి.డి కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ఆవశ్యకతను మంత్రి వివరించారు. వందేమాతరం, భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ మెయిన్‌రోడ్డు తహసీల్దార్ కార్యాలయ ఆవరణ నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆకుల రాజు అన్నారు. నషముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాపై అవగాహన కల్పించారు. అనంతరం యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. క్రమశిక్షణతో బాగా చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ మురళీధర్, ఎస్ఐ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పీఏసీఎస్ సీఈఓ రాజు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్)లో సభ్యులకు జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు పీఏసీఎస్ సీఈఓ ఎస్.పి.రాజు సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. సహకార సంఘ సభ్యులకు సహకార చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని, ప్రతీ సభ్యుడు నిబంధనలు తెలుసుకోవాలన్నారు.

యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ

సీతానగరం: యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఎస్ఐ ఎం.రాజేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎం.దాలినాయుడు, ఎన్ఎస్ఎస్ పీవోలు రామకృష్ణ ఆధ్వర్యంలో మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో భాగంగా రాష్ట్ర రహదారి, కళాశాల ఆవరణలో బుధవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ కింద ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కొఠియా గ్రామాలపై ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

సాలూరు రూరల్: మండలంలోని కొఠియా గ్రామాల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తోందని ఆయా గ్రామాల గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఒడిశా అధికారులు, మంత్రులు కొఠియా గ్రామాల్లో కలియ తిరుగుతుంటే నియోజకవర్గానికి చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాత్రం ఆ గ్రామాల సమస్యలను పట్టించుకోవడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇదే విషయాన్ని సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనులు ఆంధ్రా ప్రభుత్వంలోనే ఉంటామని చెబుతున్నా కూటమి ప్రభుత్వం ఈ విషయంలో అసలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల వేళ కొఠియా గ్రామాల ఓట్ల కోసం తిరిగిన ప్రస్తుత మంత్రి ఇప్పుడు కనీసం పట్టించుకోవడం దారుణమని వారు పేర్కొంటున్నారు.

ప్రమాదానికి నిలయంగా జాతీయ రహదారి



చినబోగిలి పామాయిల్ తోట వద్ద ప్రమాదానికి నిలయంగా మారిన గోతులు

సీతానగరం: జాతీయ రహదారిపై చినబోగిలి వద్ద రహదారి ప్రమాదాలు నిత్యకృత్యమైనా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు భయాందోళనలు చెందుతున్నారు.

ఈ ప్రాంతంలో రహదారి మొత్తం గుంతలమయమై ప్రమాదానికి కేరాఫ్ చిరునామాగా మారిపోయింది. ఈ రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ఏళ్లుగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ మార్గంలో గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న పార్వతీపురం పట్టణ పోలీసులు

పార్వతీపురం రూరల్: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. మత్తు, మాదకద్రవ్యాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యాయులు, పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో నషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ సీఐ కె.మురళీధర్, ఎస్ఐ. గోవింద, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజు మరికొందరు ఉపాధ్యాయులు పోలీసులు పాల్గొన్నారు.

మండలంలో..

మండలంలోని కేజీబీవీ పాఠశాలలో పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి సంతోష్‌కుమారి నేతృత్వంలో కవిటిభద్ర కస్తూర్బా గాంధీ విద్యార్థులతో నషా ముక్త భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రూరల్ పోలీసులు, కస్తూర్బా గాంధీ ఉపాధ్యాయులు ఉన్నారు.

అన్నదాత సుఖీభవ కోసం పడరాని పాట్లు

సాలూరు రూరల్: మండలంలోని పలువురు రైతులకు ఇప్పటికీ అన్నదాత సుఖీభవ నగదు జమ కాలేదు. దీంతో రైతులు ఏం జరిగిందో తెలుసుకుని సరిదిద్దేందుకు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన వారి పేర్లు అనర్హుల జాబితాలో ఉండడంతో చేసేది లేక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. బుధవారం మరిపల్లి గ్రామానికి చెందిన బంటు జానకమ్మ, పోతనబిల్లి లచ్చమ్మ, దాసరి మంగ, బంటు గైరమ్మ సచివాలయానికి వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు. సచివాలయ సిబ్బంది ఆలస్యంగా వచ్చినా వారు వచ్చేంత వరకు గంటల తరబడి నిరీక్షించి తమ బాధను చెప్పారు. గత ప్రభుత్వంలో అందరికీ ఈ పథకం కింద నగదు జమైందని, ఇప్పుడు దాన్ని అర్హులైన తమకు వర్తింపజేయకపోవడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు మండల సమావేశం

మక్కువ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో డి.స్వరూపరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

సారా రహిత మండలంగా తీర్చిదిద్దాలి

పాచిపెంట: పాచిపెంటను సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలని ఎంపీపీ బడ్నాన ప్రమీల కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సారా నిర్మూలన చేసేందుకు క్షేత్ర స్థాయిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి మండల స్థాయి అధికారులు తగు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీసు శాఖలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో పాత్రో, ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ



ఎర్రసామంతవలసలో ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గ్రామంలో బుధవారం ఎస్ఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు మాదకద్రవ్యాలు నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఏఎస్ఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టారు. సారా, గంజాయి సేవించరాదన్నారు. యువత సన్మార్గంలో నడుచుకోవాలని కోరారు.

తక్కువ ధరకే నిత్యావసర సరుకులు



తాడికొండ రేషన్ డిపోలో రికార్డులు పరిశీలిస్తున్న జీసీసీ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం:

గ్రామాల్లోని రేషన్ డిపోల్లో మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకే నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచుతున్నామని ప్రజలంతా సద్వినియోగించుకోవాలని జీసీసీ జనరల్ మేనేజర్ బి.సూర్యనారాయణ సూచించారు. పార్వతీపురం జీసీసీ డివిజన్ పరిధిలోని కురుపాం మండల కేంద్రం, గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంతో పాటు దుడ్డుఖల్లు, తాడికొండ గ్రామాల్లోని జీసీసీ స్టాక్ పాయింట్లతో పాటు రేషన్ డిపోలను బుధవారం ఆయన పరిశీలించారు. అలాగే గుమ్మలక్ష్మీపురం బ్రాంచ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024–25లో జీసీసీ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన అటవీ ఉత్పత్తుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు సమీపంలోని సంతల్లో, బహిరంగ మార్కెట్లో విక్రయించే నిత్యావసర సరుకులను అధిక ధరలకు కొనుగోలు చేస్తూ నష్టపోతున్నారని, అంతే కాకుండా ఆ వస్తువుల్లో నాణ్యత కొరవడుతున్నప్పటికీ అవే వాడాల్సి వస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో నాణ్యమైన వస్తువులను ఎమ్మార్పీ కంటే తక్కువకే అందజేసేందుకు రేషన్ డిపోల వద్ద నిత్యావసర సరుకుల అమ్మకాలు విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ సరుకుల పంపిణీతో పాటు డిపోల వద్ద నిత్యావసర సరుకులు కూడా విక్రయిస్తామని, 16 నుంచి 30వ తేదీ వరకు కేవలం నిత్యావసర వస్తువులను మాత్రమే విక్రయిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.24 కోట్లతో 2025–26 ఆర్థిక సంవత్సరంలో అటవీ ఉత్పత్తుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.ఈయన వెంట జీసీసీ డీఎం జే.రామారావు, బ్రాంచ్ మేనేజర్లు ఎస్.రాము, ఎం.సాంబశివరావు, తదితరులున్నారు.

ఎయిడెడ్ పాఠశాలలు పునఃప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ లేక మూతపడిన మండలంలోని దుమ్మంగి, బొద్దిడి, పి.ఆమిటి గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పునః ప్రారంభమ య్యాయి. ఆయా పాఠశాలలను కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభంతో ఈ గ్రామాల విద్యార్థులకు ఉన్న ఊరిలోనే ప్రాథమిక విద్య అందుతుందన్నారు.